


మురళీకృష్ణుడిగా నారసింహుడు!


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 23 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 05


## చెట్టుపట్టాల సమస్యపై శాసనమండలిలో స్వరం వినిపిస్తా

### సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు సరికావు: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** గ్రామీణ పేద రైతుల చెట్టుపట్టాల సమస్యను శాసనసభలో ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హామీ ఇచ్చారు. ఆదివారం ఖుదాబక్ష్‌పల్లి సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు పేదల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపే విధంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మొండి బకాయిల పేరుతో బ్యాంకుల నుంచి కార్పొరేట్ సంస్థలు పొందిన లక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు సుప్రీం కోర్టు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వాలు కార్పొరేట్లకు మద్దతుగా వ్యవహరించిన సందర్భాల్లో న్యాయస్థానాలు స్పందించలేదని, అయితే పేదల సంక్షేమ పథకాల విషయంలో మాత్రం వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ఉపాధి లేనప్పుడు ప్రభుత్వాలు తప్పనిసరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆ పథకాలు లేకపోతే వారి జీవనం కష్టసాధ్యమవుతుందని అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, కార్పొరేట్లకు దోచిపెడుతున్న సంపదపై అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సిపిఐ పోరాటాల ఫలితంగా లక్షలాది ఎకరాల భూమి పేదలకు అందిందని గుర్తుచేశారు. ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో గత 6070 సంవత్సరాలుగా చెట్ల నుంచి ఫలాలను సేకరించి జీవనోపాధి పొందుతున్న పేద రైతులకు ఇప్పటికీ చెట్టుపట్టాలు లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి తక్షణమే చెట్టుపట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.గ్రామంలో గతంలో అనేక పోరాటాలు జరిగాయని, ఆ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం మరోసారి సంఘటితంగా ముందు కు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల భిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,గ్రామ శాఖ కార్యదర్శి మేదరి యాదయ్య,పొట్ట అశోక్, గిరి ముత్తయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్(-) అలైవ్ రోడ్డు భద్రత అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల ప్రాణభద్రత ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నేటి నుండి వారం రోజులపాటు రెండవ దశ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పి కె నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నిర్మూలించడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన పెంపొందించడం దీని ముఖ్య ఉద్ధేశ్యమని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో దీనిపై విస్తృత ప్రచారం చేస్తామని, ప్రజలకు ట్రాఫిక్ నియమాలను తెలియపరుస్తామన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపకూడదని అంశాలపై ప్రతిరోజు ఒక కార్యక్ర మం నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క రూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరారు.

## 28న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేద్దాం

### ఏజెన్సీ విధానం రద్దుచేసి కార్పొరేషన్ జీతభత్యాలు చెల్లించాలి
### పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఈనెల 28న వరంగల్‌లో నిర్వహించనున్న ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంవత్సరాలుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్‌లుగా పనిచేస్తున్న కార్మికులను ఇప్పటికీ పర్మినెంట్ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా అరకొర వేతనాలతో ఏజెన్సీల శ్రమదోపిడికి గురవుతున్నారని విమర్శించారు.కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించిన ఈ కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీంకోర్టు తీర్పు అమలులోకి రాకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ విధానం రద్దుచేసి, కార్పొరేషన్ ద్వారా నేరుగా జీతభత్యాలు చెల్లించే విధానం అమలు చేయాలని కోరారు.పెరుగుతున్న ధరల నేపథ్యంలో కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత టెండర్లను కొనసాగిస్తూ తక్కువ జీతాలతో పని చేయించడం తక్షణమే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 28న వరంగల్ జిల్లా కేంద్రంలో వేలాదిమందితో భారీ ప్రదర్శన,కార్మిక సభ నిర్వహిస్తున్నామని, మెడికల్ కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి విశ్వనాథులు,లెనిన్,యూనియన్ నాయకులు ఏం. యాదగిరి,సిహెచ్.నిర్మల, పి.ఎల్లమ్మ, పద్మ,ఏ.రామేశ్వరమ్మ,అన్నపు లింగస్వామి,సందీప్, మధు, సబిత,కే. నిర్మల,ఉషమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి నెలా ఉచిత కంటి వైద్యశిబిరం

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
### 12 విడత కంటి వైద్య శిబిరంలో 610 మందికి కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/చండూరు:** మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు ఎవ్వరు కంటి సమస్యతో బాధపడవద్దని కండ్ల సమస్యలు ఉన్న వారు ధైర్యంగా వెళ్లి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గం ప్రజలకు భరోసా కల్పించారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడే ప్రత ఇఒక్కరికి కంటి చూపు మెరుగవ్వాలనే తలంపుతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తుండటంతో ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయం వద్ద చండూరు మున్సిపాలిటీ, చండూరు మండల ప్రజలకు 12వ విడుత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ,మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిభిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరెవరికి ఏ ఏ కంట ఇసమస్యలు ఉన్నాయని ఆరా తీసి మీకు నేనున్నానని భరోసా కల్పించారు.ఈ 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 610మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో250 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైయ్యారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిలో ఆదివారం 155 మందిని వెంటనే ఆపరేషన్ కొరకు హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారందికి మంగళవారం కంటి ఆపరేషన్లు చేయనున్నారని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి నెల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పార్టీ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, అబ్బనబోని లింగ య్య , మారయ్య పాల్గొన్నారు.



## న్యూ చట్నీస్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలో ఆదివారం అమరావతి వైన్స్ ఎదురుగా న్యూ చెట్నీస్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎస్ఐ కె లింగారెడ్డి, నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడుతూ ఫ్యామిలీ రెస్టారెంట్ లో కస్టమర్లకు నాణ్యమైన ఫుడ్ అందించాలని, రెస్టారెంట్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కస్టమర్ల కు రుచికరమైన భోజనం, మంచి ఆహార పదార్థాలు అందించాలని రెస్టారెంట్ మేనేజ్మెంట్ వాళ్లకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిర్మల వెంకటయ్య గౌడ్,దామెర మాజీ సర్పంచ్ యాదగిరి, నరసింహ చారి,సైదులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ



**ప్రజాపక్షం/వేములపల్లి:** పేదోడి సొంత ఇంటి కల సహకారం చేయాలని కాంగ్రెస్ పార్టీ అత్యున్నత హామీ ఇందిరమ్మ ఇల్లు మండల కేంద్రంలోని దైదగిరి అరుణల సొంతింటి కల నిజం చేయడానికి ఆదివారం మాజీ ఎంపీపీ పుట్టల సునీత కృపయ్య భూమి పూజ చేసి ముగ్గు పోయించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఇల్లు కట్టుకోవాలని కల నేటికి కాంగ్రెస్ కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేసే దిశగా ఇప్పటికేనిజం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు పుట్టల పెద్ద వెంకన్న తొమ్మిదవ వార్డ్ మెంబర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆపదలో అందుకునేందుకు కమిటీ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలో 99091 టెన్త్ బ్యాచ్ ద్వితీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అతిధి రిస్టార్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సుమారు 60 మంది హాజరయ్యారు. మిత్రులు అనారోగ్యంతో పాటు ఇతర ఆపదల సమయంలో పరస్పరం ఆదుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశారు.గౌరవ అధ్యక్షుడిగా డి. వెంకటేశ్వర్లు (ఎంఆర్‌వో),అధ్యక్షుడిగా బోనగిరి కిరణ్‌కుమార్,ఉపాధ్యక్షుడిగా చెవుగోని అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా బొల్లం యశోద, సహాయ కార్యదర్శులుగా మాధవి,శ్రీలక్ష్మి,జరీనా,చిట్టి ప్రోలు సుధాకర్, కోశాధికారిగా పెద్ది చంద్రయ్యలను ఎన్నుకున్నారు మరికొందరు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వేతనాలు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** జిపి కార్మికుల వేతనాలు విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు షేక్ యాకుబ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జిపి కార్మికుల మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిపి కార్మికులకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వీటి సమస్యల పరిష్కారం కోసం రేపు కలెక్టరేట్ వెళ్లాలని పిలుపునిచ్చారు. గోపగాని సత్యం, కొండా సైదులు, శ్రావణ్‌కుమార్, మచ్చ వీరస్వామి, ఎన్. మహేష్; రాజు, వీరాంజనేయులు, వెంకన్న పాల్గొన్నారు.

## కులమతాలకతీతంగా పండుగలు



**ప్రజాపక్షం/చింతపల్లి :** సోదరా భావంతో కులమతాలకు అతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని పీకేమల్లేపల్లి గ్రామంలో జరుగుతున్న 57వ హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలలో ఆదివారం బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ఎమ్మెల్యే బాలునాయక్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనాలు నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని నెల్వపల్లి గ్రామంలో నిర్వహించిన భ్రమరాంభ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి భేదాభిప్రాయం లేకుండా సోదరా భావంతో పండుగలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల రఘుమారెడ్డి, ప్రణవ గ్రూప్ చైర్మన్ బూరుగు రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ఉజ్జిని నరేందర్‌రావు, ఎరుకల వెంకటయ్య గౌడ్ ముచ్చర్ల గిరి, కాసారపు శ్రీను, శీనివాస్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, చాంద్‌పాషా, యూసుఫ్‌పాషా, రమేష్ రాజా, పవన్‌కుమార్, వినోద్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పసిపాప మరణానికి కారణమైన వారిని శిక్షించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాగర్ కర్నూల్ జిల్లాలో కమ్మెర గ్రామంలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన రజక చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకొని దాడి చేసి రెండు నెలల పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మిర్యాలగూడ పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద బీసీ జేఏసీ, రజక సంఘాల ఆధ్వర్యంలో దాడి, పసిపాప మృతికి కారణమైన శిక్షించాలని స్థూపం వద్ద నిరసన చేసి మాట్లాడారు. రజక కులానికి చెందిన చంద్రకళ అతని కుమారుడు గణేష్ మల్లన్న దేవున్ని దర్శనానికి వెళ్తుండగా కొంతమంది అగ్రకులాల వారు అడ్డుకోని చాకలి చంద్రక, కొడుకు గణేష్, కోడల్ని, కూతురుని బూతులు తిడుతూ దారుణంగా కొట్టడమే కాకుండా రెండునెలల పసిపాప ఉందని కూడా కనికరం లేకుండా వారి మీద దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతతో రెండు నెలల పసిపాప మృతి చెందిందని వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో యర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట్ల సుధాకర్, ఎస్పీ.నాయుడు, తుపాకుల తుకారం, వెంకన్న, సైదులు, నారాయణ, బాలరాజు, యాదగిరి, నవీన్, రాంగౌడ్, శ్రీనివాస్, లవణకుమార్, స్వాతి, లావణ్య, త్రివేణి, పార్వతి, గాయత్రి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం



**ప్రజాపక్షం/చండూరు:** మున్సిపాలిటీలో దోమల బెడద ఎక్కువ ఉన్నందున నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శనివారం రాత్రి మున్సిపాలిటీని వార్డులలో దోమల నివారణ చర్యలకు మందు పిచికరిని చైర్మన్ కోడి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ వార్డులలో ప్రజలు మురుగు కాలువలను సక్రమంగా వినయోగించుకోవాలని ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రతలు తీసుకోవాలని, చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలని అన్నారు. తమ చుట్టు ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్లు కోడి సుష్మావెంకన్న, తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్ , జెల్ల దనమ్మశ్రీనివాస్ , సాయిరాం ,అరవింద్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యతని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. హరదేవ్‌సింగ్ మహారాజ్ జయంతి సందర్భంగా నిరంకారి మిషన్, మున్సిపాలిటిల ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ అమృత్‌లో భాగంగా ఆదివారం స్థానిక మినీ ట్యాంక్‌బండ్ వద్ద స్వచ్ జల్ స్వచ్ మాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రాగునీరు స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యం కాపాడబడుతుందని అందుకే ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు పాటుపడాలని కోరారు. స్వచ్ జల్, స్వచ్ మాన్ వంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. సూర్యాపేట సంయోజక్ సరళ మాట్లాడుతూ మహారాజ్ చూపిన మార్గంలో మానవతా సేవే ముఖ్యమన్నారు. సద్దల చెరువు కట్టపై చెత్త చెదారం తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. 29వ వార్డు కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, జవాన్ వేణు, నర్సింహా రెడ్డి, విద్యాసాగర్, లక్ష్మారెడ్డి, హరీష్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రజావాణి కార్యక్రమం యథాతదం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈనెల 23వ తేదీ (నేటి) నుండి జిల్లాలోని సూర్యాపేటలో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యధాతదంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు.



## రైతుబడి 'అగ్రి షో'కు తరలివెళ్లిన రైతులు

**ప్రజాపక్షం/చండూరు:** హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న రైతుబడి అగ్రి షో కార్యక్రమానికి నల్లగొండ జిల్లాలోని చండూరు మండల రైతులు ఆదివారం తరలివెళ్లారు. రైతుబడి అగ్రి షో కార్యక్రమానికి తరలివెళ్లిన రైతులకు టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్ రామ్‌రెడ్డి అన్ని వసతులను ఏర్పాటు చేశారు. రైతులకు రవాణా ఖర్చులు ,భోజనం వసతి సౌకర్యాలను కల్పించినందుకు టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్ రామ్‌రెడ్డికి రైతులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మేకల సుదర్శన్ రెడ్డి, రవికుప్పల సురేష్ , నారపాక దానయ్య , బోయపల్లి సాయి, యాస దామోదర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పిన్నింటి నరేందర్ రెడ్డి, పెసర్ల హరీష్ పాల్గొన్నారు.

## బిసి సింహ గర్జన విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** విజయవాడలో నిర్వహించనున్న బిసి సింహా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని వడ్డేపల్లి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కీతవారి గూడెం గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసిల ఐక్యత అత్యవసరమని, బిసిలకు చెందాల్సిన హక్కులు, అవకాశాలు పూర్తిగా అందడం లేదని, కొంతమంది స్వార్థపరుల వల్ల బిసిలకు అన్యాయం, అవమానాలకు గురవుతున్నారని ఉద్యోగాలు,విద్య, ఉపాధి, రాజకీయ పదవుల్లో బిసిలకు ప్రాతినిద్యం అశించిన స్థాయిలో లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సమాజంలో 80 శాతం ఉన్న బిసిలకు అనైక్యత మూలన పదవుల్లో పదిశాతం మాత్రమే ప్రాతినిధ్యం పొందుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రజక కులస్తులపై అగ్రవర్ణాల క్రూర దాడి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రజక కులస్తులపై అగ్రవర్ణాల కిరాతక క్రూర దాడిచేయడం హేయమైన చర్య అని ఆ సంఘం జిల్లా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పగిళ్ల హుస్సేన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో ముఖ్యమంత్రి సోంత జిల్లాలో మూడు రోజుల క్రితం టికెట్ లేకుండా గుడిలోని ప్రవేశించిన కారణంగా రజక కులస్తులు గణేష్, చంద్రకళ, మౌనిక లపై అగ్రవర్ణాల రాయలేని బాషలో బూతులు తిడుతూ దురహంకారంతో అతి కిరాతంగా భయంకరంగా దాడిచేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యోగుల సంఘం నాయకులు యడవెల్లి వీరస్వామి, చిక్కుల పిచ్చయ్య, చిక్కుల శేషగిరి పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మరక్షణ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కరాటేతో ఆత్మరక్షణతోపాటు శారీరక దారుఢ్యం లభిస్తుందని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే డు అకాడమీ విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన న్యూడ్రాగన్ ఫైట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన షిఫ్ట్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్‌లో గెలుపొందిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ జెవి రమణ, ఆర్ సంతోష్ రిషికేష్ అక్షర విద్యార్థులు పాల్గొన్నారు.



# సిఎం కప్‌కు రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉషారాణి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించడం ఎంతో గర్వకారణమని, అలాంటి ప్రతిభను గరిడేపల్లి మండలం గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అమ్మనబోయిన ఉషారాణి సిఎం కప్ బాలికల విభాగంలో కబడ్డీ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ధీరావవత్ నాగమని తెలిపారు. పెన్‌పహాడ్ మండలం దూపహాడ్ గ్రామానికి చెందిన అమ్మనబోయిన నాగరాజు వీరకుమారి దంపతుల కుమార్తె ఉషారాణి పాఠశాలలో పదవతరగతి విద్యను అభ్యసిస్తుంది. సిఎం కప్ కబడ్డీ క్రీడల్లో గత గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి క్రీడకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉషారాణిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ ఉప్పలయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంఎల్‌ఏ కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు తేరాల మహేందర్, మాజీ వార్డు సభ్యులు అశోక్, సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు యాకస్వామి, ప్రభాకర్, పరుశు రాములు, శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

# వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్‌రెడ్డి సోదరుని కుమార్తె వివాహ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి సోదరుడు ఉలుపాల సునిత శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమార్తె అంజలి, కార్తిక్‌రెడ్డి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు రవీంద్ర కుమార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# మున్నూరు కాపులు ఆర్థికంగా ఎదగాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ః** మున్నూరు కాపులు ఆర్థికంగా ఎదగాలని మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం 15వ వార్డు అక్షర స్కూల్లో ఎలిమినేటి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నూతన కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడారు. కౌన్సిలర్లుగా గెలుపొందిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతి మున్నూరు కాపు యువత సమాజానికి దిక్సూచిగా నిలువాలని అప్పుడే సమాజంలో మున్నూరు కాపులకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. కౌన్సిలర్లకు బాధ్యత పెరిగిందని అన్నారు. 5 సంవత్సరాలు వార్డును అభివృద్ధి చేస్తే తర్వాత మళ్లీ వార్డు ప్రజలు మిమ్మల్ని గెలిపించుకుంటారని అన్నారు. వార్డులో ఎవరైనా మున్నూరుకాపు కులానికి చెందిన వాళ్లు సహాయానికి వస్తే మన వంతుగా సహాయం చేయాలని తెలిపారు. సంఘం అభివృద్ధికి ప్రతి గ్రామం, వార్డులో మున్నూరు కాపు సంఘ కమిటిలను ఏర్పాటు చేసి ప్రతినెల మీటింగ్ నిర్వహించి సంఘ సమస్యలు ఏమైనా ఉంటే సంఘ సభ్యులు చర్చించుకొని పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు నాయకులు కొండూరు వినోద్‌కుమార్, గడేకర్ల సత్యనారాయణ, డేగల రమేష్, శ్రావణ్ కుమార్, దంతాల వీరన్న, చెంచాల మణిలత శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సంత్‌శ్రీ సేవాలాల్ స్ఫూర్తితో లంబాడీలు ఐక్యంగా ఉండాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) ః** గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో లంబాడీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లూనావత్ పాండు నాయక్, కార్యదర్శి ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. ఆదివారం తిరుమలగిరి మండల పరిధిలోని మొండిచింత తండ గ్రామ పంచాయితీలో సర్పంచ్ లావుడ్యా శ్రీలత బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా భోగ్ బండార్ నిర్వహించి సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు ఏఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోతు నాగు నాయక్‌తో కలిసి మాట్లాడారు. చెట్టుకు, పుట్టకు ఒక్కొక్కరుగా ఉంటూ సంచార జీవనం సాగిస్తున్న లంబాడీలను సేవాలాల్ మహారాజ్ చైతన్యం చేసి స్థిర నివాసాలు తండాలుగా ఏర్పాటుకు కృషిచేశారని గుర్తు చేశారు. అంతకు ముందు లంబాడీల వేషధారణలో మహిళలు చేసిన నృత్యాలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఏఐబిఎస్ఎస్ యూత్ జిల్లా అధ్యక్షులు లావుడ్యా బాలాజీ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాటోత్ శిరీష శీను, మాజీ సర్పంచ్ లావుడియా మోహన్‌బాబు, నాయకులు గుగులోతు వెంకన్న నాయక్, గుగులోతు వీరన్న నాయక్, బానోతు నాగు నాయక్, దాచేపల్లి వెంకన్న, రాజు పాల్గొన్నారు.

# భూపతికుంటలో మట్టి మాఫియా

## భారీ ఎత్తున అక్రమ తవ్వకాలు - నాలుగు టిప్పర్లు, జేసీబీపై కేసు నమోదు





**ప్రజాపక్షం/నకిరేకల్ :** నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గొల్లగూడెం గ్రామంలో మట్టి మాఫియా అక్రమ కార్యకలాపాలు వెలుగుచూశాయి. గ్రామంలోని భూపతికుంట పరిధిలో కొంతమంది వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తూ ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు.ఫిర్యాదు అందడంతో పోలీసులు, ఇరిగేషన్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు నిర్ధారించడంతో నాలుగు టిప్పర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా నకిరేకల్ ఇరిగేషన్ ఎఈ బి. పాండు మాట్లాడుతూ, భూపతికుంటలో సుమారు 8 ఎకరాలు 39 గుంటల ప్రభుత్వ శిఖరం భూమి ఉన్నదని తెలిపారు. గతంలో పిఆర్ పనుల నిమిత్తం సంబంధిత కాంట్రాక్టర్ లేఖ ఆధారంగా అనుమతులు ఇచ్చినప్పటికీ, ఆ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లు ఫీల్డ్ పరిశీలనలో తేలిందని తెలిపారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.ఎఈ పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సిఐ హరిబాబు తెలిపారు. నాలుగు టిప్పర్లు, జేసీబీ యజమానులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.ఎవరు తరలిస్తున్నారు దీని వెనుక ఎవరున్నారని విచారంలో తేలాల్సి ఉంది.

# శ్రీకోదండ రామాలయ భక్తజన బృందానికి సన్మానం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అరవింద సమేత 54వ వార్షిక ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా భజన బృందాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు 26 భజన బృందాలు పాల్గొనగా నాల్గవ విజేతగా ఏడు వేల రూపాయల నగదు పారితోషకం, సత్కారం పొందినందుకు కొండాయిగూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి కోదండ రామలయ భజన బృందం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నాలుగవ స్థానం సాధించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు అన్నపూర్ణ, కందుల సైదమ్మ, భక్త బృందం వారు పాల్గొన్నారు.

# మంచినీటి సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ః** రానున్న వేసవి కాలం దృష్ట్యా సూర్యాపేట పట్టణానికి నీటిని సరఫరా చేయు ఇమాంపేటలోని మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద అత్యవసర మరమ్మత్తు పనులు నిర్వహించబడుచున్నందున నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి తెలిపారు. ఈనెల 24 నుండి 26 వరకు మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేయబడుతున్నందున ప్రతి కుటుంబం అవసరాలకు సరిపడా త్రాగునీటిని ఇండ్లలో నిల్వ చేసుకోవాలని, అనవసర వినియోగం, నీటి వృధాను నివారించాలని ప్రజలని కోరారు.

# నకిరేకల్‌లో కారు అదుపుతప్పి బీభత్సం





**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రధాన కూడలి నుంచి తిప్పర్తి రోడ్డు వైపు వెళ్తున్న కారు మసీదు సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో అక్కడ నిలిపి ఉంచిన తోపుడు బండిని, రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనాలు, తోపుడు బండి తీవ్రంగా ధ్వంసమయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి, తోపుడు బండి వద్ద ఉన్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు.పెను ప్రమాదం తప్పింది. అతివేగం,అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

# గ్రామదేవతల ఆలయాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాల నిర్మాణం కోసం తెలంగాణ డైరీ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆదివారం శంఖుస్థాపన చేశారు. తన స్వగ్రామంలోని పురాతన ఆలయాలైన ఊర ముత్యాలమ్మ, ఊర మారమ్మల ఆలయాలను పునఃనిర్మాణంలో భాగంగా శంఖుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు అత్యంత భక్తి భావంతో పూజించే ఆలయాలు త్వరతగతిన పూర్తయ్యేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాగర్ల భాను భిక్షం, ఉప సర్పంచ్ ఉయ్యాల నరేష్, కాంగ్రెస్ నాయకులు గుత్తా దేవేందర్‌రెడ్డి, కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు, పోలగోని స్వామి, జనపాల శ్రీను, పాకాల దినేష్ పాల్గొన్నారు.

# దోమల మందు పిచికారీ ప్రారంభం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలో పారిశుద్ధ్య నివారణకే తోలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పాత మున్సిపాలిటి నుండి దోమల మందు పిచికారిని ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యానికి బరోసా ఇచ్చేందుకు పారిశుద్ధ్య నివారణతో పాటు దోమల బెడద నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని, ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయకుండా మీ ఇంటి ముందుకు వచ్చే చెత్త వాహనంలోనే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గుండపునేని పద్మావతి, కందుల కోటేశ్వరరావు, తోట జ్యోతి, కట్టెబోయినజ్యోతి పాల్గొన్నారు.





## సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**ప్రజాపక్షం/డిండి;** శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం దాసరి నెమలిపూర్ గ్రామంలో 39వ బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరగుతున్నాయి. ఆదివారం శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి సన్నిదిలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ గంగిడి కొండల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామచంద్రయ్య,ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ రఫియా బషీర్, ఉప సర్పంచ్ రాంరెడ్డి, జహంగీర్, నర్సింహారావు బాలయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా డ్రైనేజీ పనులు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని జేబి కాలనీలో ముమ్మరంగా డ్రైనేజి నిర్మాణ పనులు జరుగుతున్నాయని సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జేబిలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ జేబిలోని అన్ని బజార్‌లలో డ్రైనేజి పనులు పూర్తి కావచ్చినట్లు తెలిపారు. త్వరలో సిసి రోడ్లు కూడా జేబిలో వేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ కొడిదల పద్మ వెంకటయ్య, 6వ వార్డు సభ్యులు ఊరే నరేష్, రావుల సత్యనారాయణ ఉన్నారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో రజక వర్గానికి చెందిన చిన్నారి మృతి ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ కోరారుడిమాండ్ చేశారు. ఘటనపై ఎస్‌సి,ఎస్‌టి(అత్యాచార నివార) చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలపరిహారం చెల్లించడంతో పాటు ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని, సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చిన్నారులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో ఆదివారం జరిగిన బందెల తిరుపతయ్య భవాని దంపతుల కూతురు సహస్ర, కుమారుడు ప్రణయ్ యాదవ్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన బిఆర్‌ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్.



## 21వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు ప్రాతినిద్యం వహిస్తున్న 21వ వార్డులో చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లతో కలిసి ఆదివారం వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా మున్సిపల్ శాఖపరమైన వీధి దీపాల ఏర్పాటు, వాటర్ సప్లయి విభాగము, శానిటేషన్ విభాగం, ఇంజనీరింగ్ విభాగంలో సంబంధించిన మున్సిపల్ శాఖ అధికారులు, 20 మంది సిబ్బంది 21వ వార్డులో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ లు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పాలకవర్గ సహాకారంతో 21వ వార్డులో ఉన్నటువంటి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చటం, వీధి దీపాలలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడటం, శానిటేషన్ వ్యవస్థను చూడటం, అవసరము ఉన్న చోట సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు చేయటం కోసం పూర్తి సహాకారం అందిస్తూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌళిక సదుపాయల కృషి చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మెరిగ అశోక్, ఎన్విరాల్‌మెంట్ ఏఈ రాజశేఖర్, వీధి దీపాల నిర్వాహణ, వాటర్ సప్లయి శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గౌడ్‌లు రాజకీయంగా బలోపేతం కావాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** గౌడ కులస్తులు రాజకీయాల్లో మరింతగా బలోపేతం కావాలని పలువురు గౌడ్ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు కోరారు. ఆదివారం జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ తల్లి దేవాలయం వద్ద నూతనంగా ఎన్నికైన హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లకు జైగౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షులు కేశగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ ఫోటో మెమోంట్లను అందజేసి పూలమాలలతో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వల్లపుదాసు కృష్ణ, చెన్నగాని సైదులు, బెల్లంకొండ లలిత, యరగాని సుష్మా మురళి, మాజీ ఎంపిపి నర్సింగ్ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ చిరంజీవి, పెద్ద గౌడ్, మాజీ జడ్పిటిసి పెండెం శ్రీనివాసగౌడ్, కీతవారిగూడెం సర్పంచ్ రామనాదం, నర్సింగ్ డాక్టర్ రంజిత్‌గౌడ్, తుమ్మల సైదులు, కొప్పు రామకృష్ణ, పురుషోత్తం, కుక్కడపు సైదులు, భాస్కర్ పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**ప్రజాపక్షం/పోచంపల్లి :** లైన్స్ క్లబ్ ఆఫ్ పోచంపల్లి ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపును మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. 500కు పైగా వివిధ రోగాలతో బాధపడుతున్నవారు పాల్గొని 2డి ఇకో బీపీ షుగర్ కంటి ఎముకలు, కాలేయం ఊపిరితిత్తుల సంబంధించి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు రోగులకు ఆరోగ్యం పట్ల తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ క్లబ్ అధ్యక్షులు ముసునూరి నరసింహ, చౌటుప్పల్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు తిరందాసు జగన్నాథం, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, కార్యదర్శి కర్నాటి నరసింహ సీత భాస్కర్, ఏలే హరి శంకర్, రామిడి వెంకట్ రెడ్డి, మంగళపల్లి రమేష్, గంజి బాలరాజు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/హాలియా:** నేటి యువత సేవ దృక్పథాన్ని అలవర్చుకొని సమాజసేవలో భాగస్వాములు కావాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతయ్య అన్నారు. హాలియాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా పాలెం, ఇబ్రహీంపేట గ్రామాలలో పాఠశాల, గుడి, పలు వీధులు శుభ్రం చేసి స్థానికులకు వివిధ అంశాల మీద అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సమాజం పట్ల అవగాహన కలిగి మీరు చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి చెప్పాలని దానివలన వారు పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ కాంతాయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు చాపల శేషు తదితరులు పాల్గొన్నారు.




## విద్య విలువైన సంపద

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్య విలువైన సంపద అని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సామాజికవేత్త, పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ సూచించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి, డిగ్రీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆదివారం విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, అలివేలు, సభ్యులు పాల్గొన్నారు.





## నాగార్జునసాగర్ సందర్శించిన చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్

**ప్రజాపక్షం/నందికొండ:** ఆదివారం అటవీ డివిజన్ చీఫ్ కన్జర్వేటర్ సునీల్ హీరావత్ కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మొదట బుద్ధవనంను సందర్శించి అక్కడి బౌద్ధ సాంస్కృతిక నిర్మాణాలను పరిశీలించారు.అనంతరం నాగార్జునకొండ మ్యూజియం ను దర్శించి మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధ ధాతువులను వీక్షించారు. అలాగే నాగార్జునకొండపై పునర్నిర్మిత కట్టడాలైన సింహాల విహారం, మహా స్థూపం, అశ్వమేధ యజ్ఞశాలలను పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను వివరించారు. ఈ సందర్శనలో నలగొండ జిల్లా అటవీ శాఖ అధికారి శాంతారాం,సాగర్ ఎఫ్‌డీఓ సునీత, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గౌతమ్, సెక్షన్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

## దాడికి నిరసనగా జెఎసి ర్యాలీ




**ప్రజాపక్షం/కోదాడ:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో బిసి చాకలి కులస్తులపై జరిగిన దాడిని ఖండిస్తూ కోదాడలో బిసి, ఎస్సి, ఎస్టి, జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తల్లి, కొడుకు, కోడలిపై దాడి చేసి రెండు నెలల పసిబిడ్డ మృతికి కారణమైన నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఘటణకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐను వెంటనే తొలగించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నాగేశ్వర రావు, ఎల్లయ్య, నాగేందర్, ఆదిలక్ష్మి , సురేష్, లింగయ్య, సతీష్, శ్రీను, యాదగిరిస్వామి, భూమా శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

## సోమయ్య జీవితం ఆదర్శప్రాయం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** సిపిఐ(ఎంఎల్) జనశక్తి సీనియర్ నాయకులు,గాయని పల్స నిర్మల తండ్రి అమరుడు చీటూరి సోమయ్య జీవితం ఆదర్శప్రాయమని రైతుకూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బొమ్మకంటి కొమరయ్య పేర్కొన్నారు. ఆదివారం నకిరేకల్‌లో సోమయ్య మొదటి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగానివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాయని పల్స నిర్మల,కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాసు, సంఘం నాయకులు బంటు రామలింగయ్య,పల్లెబోయిన జానీ, న్యూడెమోక్రసీ నాయకులు గజ్జి రవి పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు నీడ



**ప్రజాపక్షం/మర్రిగూడ :** రాష్ట్రంలోని ఇల్లు లేని నిరాశ్రయులకు నీడను కల్పిస్తుందని సర్పంచ్ లపంగి నర్సింహా అన్నారు.రాంరెడ్డి పల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి పథకంలో లబ్ధి పొంది సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు రావుల పాండు ఇంటి నిర్మాణన్ని పూర్తి చేసుకోని గృహప్రవేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ లపంగి నరసింహ నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై సొంత ఇంటి కల నెరవేర్చుకున్న రావుల పాండ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కారింగు నర్సింహా, నాయకులు వెన్నమనేని పాపారావు, రావుల రాములు, బీమనగోని యాదయ్య పాల్గొన్నారు.

## ఆసుపత్రి స్థాయికి సమానంగా

# 108 అంబులెన్స్ వైద్య సేవలు

### విపత్తు ఏదైనా క్షణాల్లో ప్రమాద స్థలానికి 108 అంబులెన్సులు

### అత్యవసర సేవలకు ప్రజల మన్ననలు





**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** విరామం ఎరుగని సేవలతో నిర్విరామంగా 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు అందుతున్నాయి. దినదినాభివృద్ధి చెందుతూ ప్రజల హృదయాల్లో చరగని ముద్ర వేసుకున్నాయి. ఆపదలో ఉన్నామంటే మేమున్నామంటూ ఆపద్బాంధవుడిలా, అపర సంజీవనిలా కాపాడే 108 వాహనం గురించి తెలియని వారు ఉండరంటే అతియోశక్తి కాదు. ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా 108 అంబులెన్స్‌ల ద్వారా సిబ్బంది ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించిన ఘనత 108కే దుక్కుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ స్పందన చేరువవుతున్న 108 అంబులెన్సులు పగలనకా రాత్రనకా ఏ సమయంలోనైనా అత్యవసర సేవలు యాదాద్రి జిల్లా వ్యాప్తంగా ఎమర్జెన్సీ సేవలను అందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12, 108 అంబులెన్సులు ఉత్తమ సేవలను అందిస్తున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణమే హాస్పిటల్‌కు చేరవేస్తూ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారు. మన జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, ఆలేర్, వలిగొండ, చౌటుప్పల్, రామన్నపేట, మోత్కూర్, తుర్కపల్లి, పోచంపల్లి, గుండాల అంబులెన్స్ భువనగిరి ఇలా 12 వాహనాలు ప్రతిరోజు ఏదో ఒక సమయంలో ప్రమాదాలు జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పేద ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. 108 అంబులెన్స్‌లో ప్రధమ చికిత్సను అందించడానికి నాణ్యత గల ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అనుభవం ఉన్న పైలెట్ ఇద్దరు ఉంటారు. ఏ రాత్రి అయినా అత్యవసర సేవలు అందించడం లక్ష్యంగా ముందుకు వెళుతూ ఉంటారు. గత నెలలో బొమ్మలరామారం మండలం నాగినేని పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 108 అంబులెన్స్ తక్షణమే చేరుకొని వారికి ప్రధమ చికిత్సలు అందించి ఆసుపత్రికి తరలించడం జరిగింది. అంతేకాకుండా అంబులెన్సులలో తరలించేటప్పుడు గర్భిణీ స్త్రీలకు పురిటి నొప్పులు వస్తే అంబులెన్స్‌లోనే సమయస్ఫూర్తితో కాన్పులు కూడా చేయడం జరుగుతుంది. ఇలా ఒక్కటి అని చెప్పలేము పాముకాటు, ఆత్మహత్యాయత్నాలు, గుండెపోటు వచ్చినవారికి అన్ని రకాల అత్యాసర సేవలకు సంజీవనిలా పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో యాదాద్రి జిల్లా 108 అంబులెన్సులు సేవలను అందించడంలో ముందు వరుసలో ఉంటున్నాయి. అత్యధిక పరికరాలతో కూడిన చికిత్స అందించడం సెక్షన్ ఆపరేటర్స్, ట్రాన్స్పోర్ట్ వెంటిలేటర్, ట్రాన్స్పోర్ట్ ఆటోమేటిక్ డిఫైబ్రిలేటర్, సిరంజి పంప్ ఆక్సిజన్ కృత్రిమ శ్వాస అందించడానికి అంబు బ్యాగ్స్ ఇలా అన్ని పరికరాలతో కూడుకొని మెరుగైన వైద్యం అందించడంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ముఖ్యపాత్ర వహిస్తారు..

ప్రోగ్రాం మేనేజర్ సలీం షేక్ సలీం..

అతి తక్కువ సమయంలో సంఘటన స్థలానికి చేరుకోవడమే ముఖ్య లక్షయంగా పనిచేస్తున్నాం ముందు ముందుగా ఇంకా మా యొక్క సేవలను విస్తృతంగా చేయడంలో ముందుంటాం.

108 జిల్లా కోఆర్డినేటర్ ధూపాటి మహేష్ కుమార్..

రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్సను అందించడమే మా ముందున్న లక్ష్యం ప్రజలకు సేవ చేయడమే మా ముఖ్య ఉద్దేశం.

## కుల వృత్తులను పరిరక్షించాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కనుమరగవుతున్న కుల వృత్తులను పరిరక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బీసీ భవన్‌లో ఆదివారం కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారితో కలిసి ఎమ్మెల్యే మట్టి కుండలను తయారు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుండల తయారీ నైపుణ్య కేంద్రానికి స్థలం ఇప్పించే విషయమై సబ్ కలెక్టర్‌తో చర్చించి యువతను ప్రోత్సహిస్తామన్నారు. కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వంతోపాటు తనవంతుగా సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, శ్యాంప్రసాద్, శ్రీనివాస్, కామిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్ ,చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆత్మకూరు మండలం రాయపల్లి గ్రామం నందు నిర్వహించారు.ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు గ్రామ ప్రజలకు ఉచితంగా జనరల్బి ఫిజీషియన్ డాక్టర్, ఆర్థోపెడిక్ డాక్టర్ చే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద శిబిరం నుండి గ్రామ ప్రజలకు బిపి,షుగర్,న్యూరోపతి, బిఎండి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నందు గ్రామ ప్రజలకు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చావా రాజ్ కుమార్ గ్రామ ప్రజలకు బీపీ షుగర్ థైరాయిడ్ మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన లక్షణాలు,వాటి నివారణకు తీసుకొని వలసిన తగు జాగ్రత్తలను గురించి వివరించారు. ఉచిత వైద్య శిబిరం నందు 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.





## వేతనం ఒప్పందం అమలు జరపాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైస్ మిల్లు యాజమాన్యాలు వేతన ఒప్పందాన్ని అమలు జరిపి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ కట్టాలని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ముక్కెర అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ది మిర్యాలగూడ పార్ బాయిల్డ్ మోడ్రన్ రైస్ అండ్ దాల్ మిల్ వర్కర్స్(డ్రైవర్స్) సంఘం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయమై మూడు సంఘాల నాయకులు అగ్రిమెంట్ చేయాలని పలుమార్లు మిల్లర్ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమన్నారు. యాజమాన్యాలు పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయకపోవడంతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే వేతన ఒప్పందాన్ని అమలు జరపాలని సూచించారు. సమావేశంలో జి.కనకయ్య, ఎ.అంజయ్య, వెంకన్న,మోహన్‌రెడ్డి, సుమన్ వేణు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్



**ప్రజాపక్షం/దేవరకొండ;** హైదరాబాద్‌లోని గుర్రంగూడలో బంజారా నాయకులు ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని, సేవాలాల్ మహాబోగ్(హోమం) పూజలో ప్రజా ప్రతినిధులు, బంజారా నాయకులతో కలిసి నైవేద్యం సమర్పించారు. దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఈసందర్భంగా మాట్లాడుతూ బంజారా సమాజ ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయం అని అన్నారు. మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ మాట్లాడుతూ ఆ మహనీయుని అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు.

## వివాహ నిశ్చితార్థానికి హాజరు



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన పంజాల వెంకటేశ్ గౌడ్ కుమార్తె వివాహ నిశ్చితార్థం ముత్తిరెడ్డి గూడెంలో జరుగగా ఈ కార్యక్రమానికి ఆత్మకూరు మండల మాజీ జెడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, మాజీ ఎంపిపి ప్రతికంఠం హేమలత దంపతులు, ఆత్మకూరు, సర్పంచ్ బీసు ధనలక్ష్మి , బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, యాస ఇంద్రారెడ్డి, కోరె బిక్షపతి వెంకన్న, ప్రతికంఠం శంతన్ రాజు, సతీష్, విశాల్ పాల్గొన్నారు.

## కల్లూరి సహాయం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వెంకటాపురం గ్రామంలో మరణించిన పల్లెపాటి బిక్షపతి అకాల మరణానికి చింతిస్తూ గ్రామ మాజీసర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి నరసయ్య, బిఆరెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లూరి వెంకట నరసింహారెడ్డి, కల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొడపక పాపయ్య పాల్గొన్నారు.

